


# కరపత్రం

SINCE 2014

బుధవారం మే 13, 2026 | సంపుటి : 2 | సంచిక : 211 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం

### సజావుగా వరి, మొక్కజొన్న కొనుగోళ్లు



- ధాన్యం వెంటనే లారీల్లో తరలించాల్సిందే
- అవసరమైతే పోలీస్ సాయంతో ధాన్యం సేకరణ
- లారీలు పంపకుంటే క్రిమినల్ కేసులు పెట్టండి
- కలెక్టర్లకు సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు

**హైదరాబాద్,మే12 :**
ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దని.. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకు వెనకాడవద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దని తెలిపారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. మంగళవారం.. జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని.. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు గోడౌన్స్‌కు తరలించాలని అన్నారు.

మిగతాది 2లో



## జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడుత పంపిణీ

- రెండోవిడతపై 21న కేబినేట్‌లో ఖరారు చేస్తాం
- స్పెషల్ డ్రైవ్ ద్వారా డబుల్ ఇళ్లు పంపిణీ
- అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,మే12 :**
రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తామని చెప్పారు. మంగళవారం గృహనిర్మాణశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల విధివిధానాలను ఈనెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఖరారు చేస్తామని పొంగులేటి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థలాలు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్దిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. హైదరాబాద్‌లో స్థలాలు ఉన్నవారికి ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్ సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

మిగతాది 2లో




### హైకోర్టును ఆశ్రయించిన
## బండి భగీరథ్

- 14న విచారించనున్న వెకేషన్ బెంచ్

**హైదరాబాద్,మే12 :**
కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో మధ్యంతర బెయిల్ కోరుతూ బండి భగీరథ్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టుకు వేసవి సెలవులు కావడంతో వెకేషన్ బెంచ్‌లో పిటిషన్ వేశారు.

2 లో



## 'ఏపీ, తెలంగాణ అవసరాల మేరకు కృష్ణా జలాలను వినియోగించుకోవాలి'

**హైదరాబాద్:**
ఏపీ, తెలంగాణ తాగునీటి అవసరాల మేరకు కృష్ణా జలాలను వినియోగించుకోవాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశంలో నిర్ణయించారు. హైదరాబాద్‌లో జరిగిన కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశంలో ఇరు రాష్ట్రాల ఈఎన్‌సీలు,



## ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి
## బ్రిటిష్ హయాంలో నరక కూపాలుగా జైళ్లు

» తానూ ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లి వచ్చా
» చంచల్‌గూడాలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభంలో గవర్నర్





**హైదరాబాద్,మే12 :**
స్వాతంత్ర్యానికి ముందు జైళ్లు ఎంత అమానవీయంగా ఉండేవో ప్రజలకు తెలియజేయాల్సి ఉందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తెలిపారు. మంగళవారం చంచల్‌గూడ జైలులో ఏర్పాటు చేసిన మ్యూజియం, ఫీల్ ది జైల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. స్వాతంత్రానికి పూర్వం జైల్లో గడిపిన వారు ఎలా ఉండేవారనే విషయం ఈ మ్యూజియంను చూస్తే తెలుస్తుందన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభించడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ మ్యూజియంలో ఉన్నది కేవలం ఇతిహాసానికి సంబంధించిన వస్తువులు కాదన్నారు. స్వాతంత్రానికి ముందు జైళ్లలో ఉన్నవారు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో ఈ మ్యూజియం ద్వారా తెలుస్తుందని చెప్పారు. శిక్షల పేరుతో సంస్కారాన్ని, శరీరాన్ని, మనస్తత్వాన్ని విరగ్గొట్టే ప్రయత్నం చేశారని బ్రిటిష్ పాలనలో సాగిన అకృత్యాలను ఆయన వివరించారు.మన కోసం మన పూర్వీకులు పడ్డ కష్టాన్ని తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ప్రజలకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో తాను పలుమార్లు జైలుకు వెళ్లానన్నారు. ఎమర్జెన్సీ సమయంలో 21 రోజులు తాను జైల్లో ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు.

02

## తెలంగాణ పోలీసుల ఎదుట
## లొంగిపోయిన మావోయిస్టు కీలక నేత

**హైదరాబాద్:**
మావోయిస్టు కేంద్రకమిటీ సభ్యుడు పసునూరి నరహరి అలియాస్ సంతోష్ తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఝార్ఖండ్‌లోని సరండా ఫారెస్ట్‌లో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి.



2లో..

## నీట్ పేపర్ లీకేజీకి కేంద్రానిదే బాధ్యత

» పేపర్ లీకేజ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలి
» ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్



**హైదరాబాద్,మే12 :**
దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ఎంపీ చామల కిరణ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మే 3వ తేదీన జరిగిన నీట్ పరీక్షను రద్దు చేశారని అన్నారు. నీట్ పరీక్ష రద్దుకు నేషనల్ టెస్ట్ ఏజెన్సీ, సెంట్రల్ ఎడ్యుకేషన్ మినిస్ట్రీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బాధ్యత



### బండి కుమారుడిని
## తప్పించే యత్నం

- సిట్ విచారణ పేరుతో కాలయాపన
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు

**నిజామాబాద్,మే12 :**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రమంత్రి కుమారుడు పరారీలో ఉన్నాడని అనడం హాస్యాస్పదమని అన్నారు.

మిగతాద్ది 2 లో



2లో..

## సనత్‌నగర్ టిమ్స్‌లో వైద్యసేవల ట్రయల్ రన్

» స్వయంగా పరిశీలించిన మంత్రి దామోదర
» జూన్‌లో ప్రారంభిస్తామని వెల్లడి

**హైదరాబాద్,మే12 :**
సనత్‌నగర్ టిమ్స్‌లో జరుగుతున్న వైద్య సేవల ట్రయల్ రన్‌ను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు.హాస్పిటల్ బ్లాకులన్నీ మంత్రి కలియ తిరిగారు. ఓపీ రిజిస్ట్రేషన్, ఐపీ వార్డులు, ఎమర్జెన్సీ డిపార్ట్ మెంట్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ల్యాబులు, మెకనైజ్డ్ ల్యాండ్రీ, కిచెన్ తదితర అన్ని డిపార్ట్‌మెంట్లను మంత్రి పరిశీలించారు. పెండింగ్ పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి సూచించారు. హాస్పిటల్‌కు నీళ్లు, పవర్ సప్లైలో ఎలాంటి ఆటంకం ఉండకూడదని, 24 గంటల సరఫరా ఉండాలని మంత్రి సూచించారు.



## పోక్సో కేసులో కుల ప్రసక్తి ఉండదు

» చట్టం అందరికీ ఒకేలా ఉంటుంది
» పొన్న వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమన్న పిసిసి చీఫ్

**హైదరాబాద్,మే12 :**
తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వాఖ్యలను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఖండించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసు వ్యవహారంలో మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి లేదా ప్రభుత్వానికి పొన్నం వ్యాఖ్యలతో ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. మంగళవారం గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కులసంఘం మధ్యవర్తిత్వం, వివాహం ద్వారా ఇలాంటి తీవ్రమైన కేసులను పరిష్కరించుకోవాలని పొన్నం అన్నారని తెలిపారు. పొన్నం సూచనలను కాంగ్రెస్ ఖండిస్తోందని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించారు.

## ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం

మొదటిపేజీ తరువాయి

ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందే అని.. ప్రతి అధికారి జవాబుదారీ తనంతో వ్యవహరించాల్సిందే అని తేల్చిచెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలుండాలని తెలిపారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్‌కు పోర్ట్ పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమామీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని రేవంత్ తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని సూచించారు. అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అకాల వర్షాల సమయంలో నష్టం జరగకుండా శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. మిషన్ మోడ్‌లో పనిచేస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని తెలిపారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని.. ఏ సమస్య వచ్చినా కలెక్టర్లదే బాధ్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## బండి కుమారుడిని తప్పించే యత్నం

మొదటిపేజీ తరువాయి

సిట్ విచారణ పేరిట నిందితుడిని సీఎం రేవంత్ రెడ్డి తప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఒక మైనర్ బాలికకు డ్రగ్స్ ఇచ్చి, మద్యం తాగించి అత్యాచారం చేసినట్లు ఆరోపణలు వస్తున్నా.. పోలీసులు మూడు నెలలుగా ఫిర్యాదు తీసుకోకుండా తాత్సారం చేయడం వెనుక రాజకీయ ఒత్తిడి ఉందని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మీడియాలో వార్తలు వచ్చిన వెంటనే గత్యంతరం లేక పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. పోక్సో కేసులో బాధితురాలికి రక్షణ కల్పించాల్సింది పోయి.. ఆమెపైనే హనీట్రాప్ కేసు పెట్టడం దారుణమని మండిపడ్డారు. మైనర్ బాలిక హనీట్రాప్ చేస్తుందా అని ప్రశ్నించారు. బాధితురాలిపైనే రివర్స్ కేసులు పెట్టడం చూస్తుంటే రేవంత్ రెడ్డి, బండి సంజయ్ ఒక్కటేనని అర్థమవుతుందని అన్నారు. బాధితురాలిపైనే రివర్స్ కేసులు పెట్టడం చూస్తుంటే రేవంత్ రెడ్డి, బండి సంజయ్ ఒకటేనని అర్థమవుతోందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్‌ది ఫెవికాల్ బంధమని విమర్శించారు. వీళ్లిద్దరూ కలిసి వ్యాపారాలు చేస్తున్నారని, కుంభకోణాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అందుకే కేంద్రమంత్రి కొడుకుపై ఇంత పెద్ద నేరం మోపబడినా ప్రభుత్వం మిన్నకుండిపోయిందని అన్నారు. ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా దీనిపై స్పందించకపోవడం వెనుక మర్మమేంటని ప్రశ్నించారు. పొద్దున లేస్తే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు మీద విషం చిమ్మే బండి సంజయ్.. తన కొడుకు చేసిన నేరంపై ఏం సమాధానం చెబుతారని వేముల నిలదీశారు. తన కొడుకుపై వచ్చిన పోక్సో కేసుపై నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని.. ఈ కేసులో రాజకీయ జోక్యం లేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరపాలని.. బాధితురాలికి, ఆమె కుటుంబానికి తక్షణమే పూర్తిస్థాయి రక్షణ కల్పించాలి అని డిమాండ్ చేశారు.రాష్ట్ర పోలీసులు ఇప్పటికైనా ఒత్తిళ్లకు లొంగకుండా చట్టాన్ని గౌరవించాలని, బాధిత మైనర్ బాలికకు న్యాయం జరిగే వరకు తాము పోరాడుతామని స్పష్టం చేశారు.

## నీట్ పేపర్ లీకేజీకి కేంద్రానిదే బాధ్యత

మొదటిపేజీ తరువాయి

వహించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రద్దుతో విద్యార్థులు తమ అకడమిక్ ఇయర్‌ను కోల్పోయే అవకాశం ఉందన్నారు. నీట్ పరీక్ష రద్దుపై బీజేపీ ప్రభుత్వం చర్చ చేపట్టాలన్నారు. దేశంలో అనేక విషయాలపై చర్చ చేసే బీజేపీ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంపై సమాధానం చెప్పాలని ఎంపీ డిమాండ్ చేశారు. బీజేపీకి పాలనపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు, సామాన్యుడి అవసరం బీజేపీకి వద్దా అని నిలదీశారు. నీట్ పరీక్ష రద్దుకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం డబ్బులు ఖర్చు పెట్టి కోచింగ్‌లు ఇప్పించి నీట్ పరీక్ష రాయించారని తెలిపారు. రాజస్థాన్‌లో నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్రం పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలన్నారు. విద్యార్థుల అకడమిక్ ఇయర్ దెబ్బతినకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంపీ చామల కిరణ్ రెడ్డి డిమాండ్ చేశారు.

## హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్

మొదటిపేజీ తరువాయి

పిటిషన్‌పై ఈనెల 14న హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ జరిపే అవకాశం ఉంది.అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు బండి భగీరథ్ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసు సున్నితమైనది కావడంతో మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయడం జరిగింది. సిట్ ఏర్పాటు నేపథ్యంలో మరోసారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసే అవకాశం ఉంది. మరోవైపు బండి భగీరథ్ కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అన్ని ఆధారాలను సేకరిస్తున్నామని, నేరం రుజువైతే నిందితుడిని కచ్చితంగా అరెస్ట్ చేస్తామని కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ స్పష్టం చేశారు.

## పోక్సో కేసులో కుల ప్రసక్తి ఉండదు

మొదటిపేజీ తరువాయి

మైనర్ల విషయంలో చట్టపరంగా ఇబ్బందులు తప్పవని చెప్పుకొచ్చారు. పోక్సో చట్టప్రకారం నిందితులకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. నేర పరిశోధనలో నిందితుడి కులం లేదా సామాజిక హోదాతో సంబంధం లేదని తెలిపారు. బండి సంజయ్ ఈ కేసులో కుల రాజకీయాలను తీసుకురావడం దురదృష్టకరమని అన్నారు. ఈ కేసులో ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయాల్సిన అవసరం కాంగ్రెస్‌కి ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని తేల్చిచెప్పారు. 'నారీ శక్తి' అని నినాదాలు చేసే బీజేపీ, ఇప్పుడు బాలికపై జరిగిన దాడి విషయంలో మౌనంగా ఉండటం దేనికి సంకేతం..? అని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. బాలిక కుటుంబ సభ్యులను భగీరథ్ బెదిరిస్తున్నట్లు వస్తున్న వార్తలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని అన్నారు. నిజమని తేలితే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కేసు విషయంలో ఎలాంటి రాజకీయ జోక్యం, కుల మతాల ప్రభావం లేకుండా పారదర్శకంగా విచారణ జరుగుతుందని స్పష్టం చేశారు. నిందితుడు ఎంతటి శక్తివంతుడైనా సరే, బాధితురాలికి తాము అండగా నిలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడుత పంపిణీ

మొదటిపేజీ తరువాయి

హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్ మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదన్నారు. అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2 బిహెచ్ కె ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్దిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధతం వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనల్లో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోనే ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిధిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని అధికారులను ఆదేశించారు. 2 బిహెచ్ కె ఇండ్లకు లబ్దిదారులను కేటాయించడానికి యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తి అయిన వాటికి, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న వాటికి ఈ నెలాఖరు కల్లా లబ్దిదారులను గుర్తించాలని, అది కూడా ఆ కాలనీలకు అయిదు నుంచి ఎనిమిది కిలోమీటర్ల లోపు ఉన్న వారినే ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే నిర్మాణాలన్నీ పూర్ఖైన ఇండ్లలో లబ్దిదారులు ఉండేలా చూసేలా నిరంతరం పర్యవేక్షించా లన్నారు. ఈ కాలనీల్లో మంచినీరు, డ్రైనేజి, విద్యుత్ వంటి కనీస సౌకర్యాల కల్పనకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ పరిధిలో ఇండ్ల స్థలాలు ఉండి అర్హులైన లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, పనితీరు మెరుగుపడాలని అన్నారు. పిడిలు తమ పరిధిలో గతంలో నిర్మించిన జెన్‌ఎన్ యుఆర్‌ఎం, రాజీవ్ గృహకల్ప, వాంబే హౌసింగ్ కాలనీలన్నిటిని సందర్శించాలని స్పష్టంగా నిర్దేశిరచారు. అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి పొంగులేటి హెచ్చరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో యుఎల్ సి భూములు కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా కొంత భాగాన్ని రిజిస్ట్రేషన్ చేశారని , స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకుని రాగా వెంటనే సంబంధిత సబ్ రిజిస్ట్రార్?పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శాశ్వత భవనాలు లేని ఆర్డీవో, తహశీల్దార్, సబ్ రిజస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. రెవెన్యూ, ఫారెస్టు సరిహద్దు వివాదాలకు ముగింపు పలికేలా రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి
### బ్రిటిష్ హయాంలో నరక కూపాలుగా జైళ్లు

మొదటిపేజీ తరువాయి

అప్పుడే జైలు ఎలా ఉంటుందో తనకు తెలిసిందని వివరించారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో కళ్యాణ్ సింగ్ ప్రభుత్వంలో జైళ్ల శాఖ మంత్రిగా తాను పని చేశానని తెలంగాణ గవర్నర్ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జైళ్లలో తాను పలు సంస్కరణలు తీసుకొచ్చానని తెలిపారు. ఈ సంస్కరణలతో ఖైదీలు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. ఈ రోజు మ్యూజియంలో చూసిన దృశ్యాలతో.. మళ్లీ ఆనాటి జ్ఞాపకాలు తనకు గుర్తుకు వచ్చాయన్నారు. ఖైదీలలో ప్రతి ఒక్కరూ క్రిమినల్స్ కాదని.. పరిస్థితులు వారిని ఆ సమయంలో నిందితులుగా మార్చాయని వివరించారు. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జైలు అధికారులకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. మరోసారి తప్పుచేసే ఆలోచన రాకుండా ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు. సాధారణ ప్రజల కోసం చంచల్‌గూడ జైలు అధికారులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. జైలు ఆవరణలో 'జైల్ మ్యూజియం', 'ఫీల్ ది జైల్' పేరుతో ప్రత్యేక బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభించారు. ఇప్పటికే గోవా, కోల్‌కతా వంటి ప్రాంతాల్లో జైలు మ్యూజియాలు ఉన్నాయి. తాజాగా హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు కూడా ఈ జాబితాలో చేరింది. జైల్ మ్యూజియంలో జైలు చరిత్ర, ఉపయోగించిన పాత వస్తువులు, ఖైదీల జీవితం, శిక్షల విధానాలు వంటి అంశాలను ప్రదర్శించనున్నారు. ఇది విద్యార్థులు, పర్యాటకులు, సాధారణ ప్రజలకు జైలు వ్యవస్థ గురించి అవగాహన కల్పించడానికి ఉపయోగపడనుంది. 'ఫీల్ ది జైల్' బ్యారక్ ద్వారా సాధారణ ప్రజలు ఒకరోజు జైలు జీవితాన్ని అనుభవించేలా జైలు అధికారులు అవకాశం కల్పించారు. ఫీజు చెల్లించి రిజర్వేషన్ చేసుకున్నవారు జైలు రూల్స్ ప్రకారం ఒక రోజు బ్యారక్‌లో ఉండి, జైలు ఆహారం, రొటీన్ కార్యకలాపాలు, శిక్షల వాతావరణాన్ని అనుభవించవచ్చు. ఇది జైలు జీవితం ఎంత కష్టమో అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని అధికారులు తెలిపారు.

## తెలంగాణ పోలీసుల ఎదుట
### లొంగిపోయిన మావోయిస్టు కీలక నేత

మొదటిపేజీ తరువాయి

పొలిట్ బ్యూరో సభ్యుడు మిసిర్ బెస్ర కోసం కూంబింగ్ కొనసాగుతున్న క్రమంలో.. నరహరి తన భార్యతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయారు. నరహరి స్వస్థలం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం సోమిడి కాగా.. అతని భార్య ఏపీకి చెందిన మహిళగా సమాచారం. 1996 నుంచి అజ్ఞాతంలో ఉన్న నరహరి పలు కీలక ఆపరేషన్స్‌లో పాల్గొన్నారు. మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనేతలు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మిసిర్ బెస్ర కోసం పోలీసుల వేట కొనసాగుతోంది.

## సనత్‌నగర్ టిమ్స్‌లో వైద్యసేవల ట్రయల్ రన్

మొదటిపేజీ తరువాయి

ఫైర్ సేఫ్టీ విషయంలో రాజీ ఉండకూడదని, అన్ని ఫ్లోర్లలో మరోసారి పూర్తిస్థాయి పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. రిసెప్షన్ ఏరియా, హెల్ప్ డెస్క్, ఓపీ కౌంటర్లు, వెయిటింగ్ హాల్, ఓపీ కన్సల్టేషన్ రూమ్స్, డయాగ్నస్టిక్స్, ఇన్ పేషెంట్ వార్డులు, ఫార్మసీ తదితర ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి.. రిజిస్ట్రేషన్ కౌంటర్స్, ఫార్మసీ కౌంటర్స్ పెంచాలని మంత్రి సూచించారు. సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ, ఎక్స్ రే, ఆల్ట్రాసౌండ్ తదితర యంత్రాలను పరిశీలించిన మంత్రి.. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ యంత్రాలు పూర్తిస్థాయిలో పేషెంట్లకు ఉపయోగపడాలని, ఇందుకు అవసరమైన డాక్టర్లు, ఇతర సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రారంభం నాటికి అన్ని సౌకర్యాలతో హాస్పిటల్‌ను సిద్ధం చేయాలని, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. జూన్‌లో సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభిస్తామని అన్నారు. ఇక్కడ సక్సెస్‌ఫుల్‌గా వైద్య సేవల ట్రయల్ రన్ జరుగుతోంది.కొన్ని ఫినిషింగ్ వర్క్స్ జరుగుతున్నాయి. ఆ పనులన్నీ గడువులోగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించామన్నారు. ఇది వెయ్యి బెడ్ల హాస్పిటల్, ఇందులో 300 ఎమర్జెన్సీ బెడ్లు ఉంటాయి. అత్యవసర పరిస్థితుల్లో బాధితుల ప్రాణాలు నిలిపే గొప్ప హాస్పిటల్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నాం. గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలు, ఆర్గాన్ ట్రాన్స్‌ఎ÷-లాంటేషన్ సర్జరీలకు ఈ హాస్పిటల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఉంటుందని వివరించారు. ఇక్కడే అద్భుతమైన రీసెర్చ్ సెంటర్ అందుబాటులోకి తీసుకొస్తాం అని దామోదర అన్నారు.

## 'ఏపీ, తెలంగాణ అవసరాల మేరకు కృష్ణా జలాలను వినియోగించుకోవాలి'

మొదటిపేజీ తరువాయి

ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సాగర్‌లో ఆగస్టు 15 వరకు ఏపీకి 10 టీఎంసీల వినియోగానికి కేఆర్‌ఎంబీ అనుమతించింది. తెలంగాణకు సాగర్ నుంచి 16, శ్రీశైలం నుంచి 6 టీఎంసీల వినియోగానికి అంగీకారం తెలిపింది. ఏపీ ఇప్పటికే ఎక్కువ నీరు వాడుకుందని సమావేశంలో తెలంగాణ అధికారులు కేఆర్‌ఎంబీ దృష్టికి తీసుకెళ్లారు.

## రోగుల ప్రాణాలను కాపాడే యోధులు... నర్సులు

**సేవలో మానవత్వం... నర్సింగ్ వృత్తి గొప్పతనం**
**సంతృప్తికర వైద్య సేవల్లో నర్సుల పాత్ర కీలకం**
**వనరుల సద్వినియోగంతో ప్రైవేటుగా దీటుగా జీజీహెచ్ సేవలు**
**త్వరలో అన్ని సమస్యలకూ పరిష్కారం**
**ఎంపీ కేశినేని శివనాథ్**

రోగుల ప్రాణాలను కాపాడటంలో నర్సుల పాత్ర అత్యంత కీలకమని.. వైద్యులతో సమానంగా నర్సులు కూడా అహర్నిశలు కష్టపడుతూ రోగులకు ధైర్యం, భరోసా కల్పిస్తూ చక్కని చిరునవ్వుతో ఆత్మీయతతో రోగాన్ని దూరం చేస్తున్నారని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా మంగళవారం విజయవాడలోని న్యూ జీజీహెచ్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. వైద్యరంగంలో కీలకమైన నర్సు వృత్తికి గౌరవాన్ని, హుందాతనాన్ని తీసుకొచ్చిన ఎ÷-లోరెన్స్ నైటింగేల్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రజల ఆరోగ్యరక్షణలో నర్సులు అందించిన తోడ్పాటును ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.రిటైర్డ్ నర్సింగ్ సూపరింటెండెంట్ జి.అక్కమ్మ రూ. 50 వేలు అందించగా.. మరో లక్షా యాభైవేలు నర్సింగ్ అసోసియేషన్ ద్వారా సమకూర్చి ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.÷ూర్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న వనరులు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూనే జీజీహెచ్ ద్వారా అందించే వైద్య సేవల్లో 80 శాతానికి పైగా సంతృప్తి స్థాయి నమోదుకావడంలో నర్సుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఆసుపత్రితో పాటు నర్సింగ్ కళాశాల, వసతి గృహానికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని.. త్వరలోనే ఇవి పరిష్కారమవుతాయన్నారు. ఆసుపత్రిలో ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా క్లిష్టమైన శస్త్రచికిత్సలు నిర్వహించి రోగుల మన్ననలు పొందుతోందని.. ప్రభుత్వ చొరవతో పాటు సీఎస్‌ఆర్, దాతల సహకారంతోనూ ఆసుపత్రి అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. ఎ÷-లోరెన్స్ నైటింగేల్ సేవలు చిరస్మరణీయమని, ఆమె చూపిన సేవా మార్గం నేటికీ నర్సింగ్ వృత్తికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని మరింత మానవీయ దృక్పథంతో, ఆప్యాయతతో రోగులకు సేవలందించినప్పుడే ఆమెకు నిజమైన నివాళులు అర్పించినవారమవుతామని తెలిపారు. రాత్రీపగలు రోగుల్ని కంటికి రెప్పలా చూసుకుంటూ రోగాన్ని నయం చేసి ఇళ్లకు క్షేమంగా పంపిస్తూ నర్సులు ఆదరాభిమానాలు పొందుతున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాధనలో వైద్య సేవల్లో నాణ్యత అత్యంత ముఖ్యమని.. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అత్యంత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు, ఆరోగ్య ఆంధ్ర సాధనకు విశేష కృషిచేస్తోందని పేర్కొన్నారు. ఏ ఆసుపత్రిలో లేనివిధంగా ఇక్కడ ఓపీ ఉంటోందని.. ఇక్కడ అందుతున్న నాణ్యమైన సేవలకు ఇది నిదర్శనమన్నారు. ఐవీఆర్‌ఎస్ ఫీడ్‌బ్యాక్‌లో 95 శాతానికిపైగా సంతృప్తి స్థాయి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. అన్ని విభాగాలూ అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేసినప్పుడే ఈ లక్ష్యాన్ని చేరుకోగలమని పేర్కొన్నారు. ప్రత్యేకంగా అత్యవసర పరిస్థితులు, క్లిష్ట సమయాల్లో నర్సులు చూపించే అంకితభావం, సహనం, సేవా దృక్పథం సమాజానికి ఆదర్శమని తెలిపారు. రోగులు త్వరగా కోలుకోవడంలో నర్సుల సంరక్షణ, మానసిక ధైర్యం ఎంతో ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ వైద్య రంగంలో నర్సులు అందిస్తున్న సేవలు అమూల్యమని.. రోగుల ఆరోగ్య పరిరక్షణలో వైద్యులతో సమానంగా నర్సులు కూడా అహర్నిశలు కష్టపడుతూ సేవలందిస్తున్నారని కొనియాడారు. సేవాభావం, సహనం, మానవత్వంతో నిండిన నర్సింగ్ వృత్తి సమాజానికి ఆదర్శప్రాయమని తెలిపారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి సేవలందించిన నర్సుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరవదని తెలిపారు. నర్సింగ్ సిబ్బంది సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు విద్యాసాగర్ వెల్లడించారు.

అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మొత్తం 35 మందిని గౌరవ అతిథులు సత్కరించారు. విధి నిర్వహణలో వీరు అందించిన సేవలను ఈ సందర్భంగా అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఎ.ఏడుకొండలరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కృష్ణారావు, జిల్లా నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు క్షమాబేగం, కోశాధికారి కె.శివలీల, ఏపీ ఎన్‌జీజీవో జిల్లా అధ్యక్షకార్యదర్శులు డీఎస్‌ఎన్ రెడ్డి, పి.రమేష్, నగరశాఖ అధ్యక్షులు సీవీఆర్ ప్రసాద్, ఆసుపత్రి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ డెయిరీతో నార్ముల్ ఒప్పందం
### పాడిరైతులకు తొలుత పదికోట్లు చెల్లింపు

నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ (నార్ముల్), నేషనల్ డెయిరీ డెవలంప్‌మెంట్ బోర్డుతో త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకుంది. 15 ఏళ్లపాటు డెయిరీ అభివృద్ధి చేసే బాధ్యతను అది తీసుకోనుంది. ఒప్పందంలో భాగంగా మొదట పాడి రైతుల బకాయిలను చెల్లించేందుకు రూ.10 కోట్ల రూపాయలను చెల్లించనుంది. ఈ మేరకు ఎన్‌డిబిబి అధికారులతో తెలంగాణ రాష్ట్ర డెయిరీ విభాగం అధికారులు ఒప్పందాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, పశుసంవర్ధక, డెయిరీ, ఫిషరీస్ సెక్రటరీ ఇలంబర్తి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఔఆఆః అధికారులు పాల్గొన్నారు.

# బండి సాయి భగీరథ్ పై పోక్సో కేసు

# భావోద్వేగాలకు చట్టం ప్రభావితం కాదు

**బోయిని సత్యనారాయణ, అడ్వకేట్**

- మైనర్ బాలికగా చెబుతూ కేసు పెట్టిన అమ్మాయి మైనర్ కాదని బలమైన వాదనలు వినిపిస్తున్నాయి
- సాక్ష్యాలతో, డాక్యుమెంట్ రుజువులతో కేసు భవిష్యత్తు తేలిపోతుంది
- ఇటువంటి సున్నితమైన కేసులలో ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి

- ఈనెల 8వ తేదీ రోజున తెలంగాణలో మరియు దేశమంతా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు బండి సాయి భగీరథ్ పైన ఒక మైనర్ బాలిక చేసిన ఫిర్యాదు మరియు నమోదైన కేసు గురించి విస్తృతంగా చర్చ నడుస్తున్నది

- నోట్: పోక్సో చట్టం మరియు సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం, లైంగిక వేధింపులకు గురైన మైనర్ బాలిక పేరును గానీ, ఆమె తల్లిదండ్రుల పేర్లను గానీ లేదా వారి గుర్తింపును వెల్లడించే ఇతర వివరాలను గానీ బహిర్గతం చేయడం నేరం

కాబట్టి బాధిత బాలిక ఇచ్చిన ఫిర్యాదు పై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసు వివరాలు తేదీ 8-5-2026 రోజున క్రైమ్ నెంబర్ 684 ఆఫ్ 2026 రోజున బండి భగీరథ్ ను నిందితుడిగా పేర్కొంటూ సెక్షన్లు: BNS సెక్షన్లు 74, 75 మరియు POCSO సెక్షన్లు 11/12 కింద కేసులు నమోదయ్యాయి.అయితే..

- బండి సాయి భగీరథ్ పైన ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి కంటే ముందు కరీంనగర్ పోలీస్ స్టేషన్ లో బాధిత అమ్మాయిగా పేర్కొంటున్న మైనర్ బాలికపై హనీ ట్రాప్ ఆరోపణలతో ఫిర్యాదు చేశాడు.

- బండి భగీరథ్ ఇచ్చిన ఈ ఫిర్యాదు ఆధారంగా కరీంనగర్ పోలీసులు భారతీయ న్యాయ సంహిత లోని సెక్షన్ 308 (5),సెక్షన్ 351 (2),సెక్షన్ 61 (2) క్రింద కేసు నమోదయింది.

- తెలంగాణ పోలీసులు అటు హైదరాబాద్‌లోని పోక్సో కేసును, ఇటు కరీంనగర్‌లోని హనీ ట్రాప్ కేసును రెండింటినీ దర్యాప్తు చేస్తున్నారు

- ఈ కేసుల దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో నిన్న హైకోర్టులో బండి భగీరథ పిటిషన్ నంబర్: IA 1/2026దాఖలైన తేదీ: మే 12, 2026 ద్వారా మధ్యంతర బెయిల్ కోసం దరఖాస్తు దాఖలు చేశారు.వేసవి సెలవుల్లో ఉన్న హైకోర్టు కేసు వివరాలతో రేపు మే 14న ఈ కేసు విచారణ చేపట్టబోతున్నది

నిందితుడి తండ్రి బండి సంజయ్ ప్రముఖ రాజకీయ నాయకుడు మరియు కేంద్ర మంత్రిగా ఉన్నాడని, కాబట్టి దీనిపైన పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని రాజకీయ ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఈ రకమైన రాజకీయ ప్రేరిత విమర్శలకు చట్టం ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వదు.గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన చంద్రబాబు నాయుడు, జగన్, అరవింద్ కేజ్రీవాల్, లాలూ ప్రసాద్ యాదవ్, హేమంత్ సోరెన్ లు కూడా జైలుకు వెళ్లారని అడ్వకేట్ రవీంద్రనాథ్ అన్నారు. లిక్కర్ కేసులో ముఖ్యమంత్రి కూతురు మాజీ ఎంపీ శ్రీమతి కవిత గారు కూడా జైలుకు వెళ్లారని, కేంద్ర మంత్రులుగా పనిచేసిన చాలామంది కోర్టు ద్వారా శిక్షలకు గురయ్యారని రవీంద్రనాథ్ గారు అన్నారు.అందులో తమిళనాడుకు చెందిన రాజా కూడా ఒకడని మరచిపోకూడదు.వ్యక్తిగతమైనటువంటి వైరముతో గాని, రాజకీయ లబ్ధి కొరకు గాని, రాజకీయ కక్షలతో గాని ఆరోపణలు చేసినంత మాత్రాన కోర్టులు ఈ స్టేట్ మెంట్ లకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వదు.జరిగిన నేరం బాపతు కేసులోని కాంటెంట్ మరియు నమోదు చేసిన చట్టాలను మాత్రమే కోర్టు పరిగణన లోకి తీసుకుంటుంది.కోర్టులో నిష్పాక్షికంగా వాస్తవ విషయాలను నేర స్వభావాన్ని ఉద్దేశాలను గమనించి చర్యలు తీసుకుంటుందని అందరూ గుర్తించాలి.

- సోషల్ మీడియాలో, ప్రధాన మీడియాలో ఈ విషయం పైన విపరీతంగా వీడియోలు వార్తలు వినబడుతున్నాయి. కొన్ని మీడియా సంస్థలు



భావోద్వేగాలకు చట్టం ప్రభావితం కాదు

ఏకంగా కేసు ట్రయల్స్ నిర్వహిస్తున్నారని, ఇలాంటి భావోద్వేగాలను కోర్టులు పట్టించుకోవు.కేసును బట్టి చట్టాలను బట్టి నేరము చేశారని లేదా నేరానికి పాల్పడ్డారని కోర్టు భావించినప్పుడే తగిన చర్యలు ఉంటాయి

- ఈ కేసు విషయం పైన హైకోర్టు న్యాయవాది శ్రీ రవీంద్రనాథ్ గారు ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ చాలా విషయాలు ప్రస్తావించారు

- పోక్సో కేసు చాలా పవర్ ఫుల్ అని చెబుతూ .. మైనర్ బాలిక రేప్ కానీ, రేప్ చేసే ప్రయత్నం కానీ, మాటలతో గాని చివరికి లైంగిక సైగలతో వేధించడం గానీ తీవ్రమైన నేరమని అన్నారు

- మైనర్ బాలిక పేరుతో అమ్మాయిలను ఇలా వదిలివేయడం తల్లిదండ్రుల బాధ్యతారాహిత్యం. అమ్మాయి గాని అబ్బాయి గాని విచ్చలవిడిగా తిరుగుతూ లేని పోనీ తలనొప్పి ఇచ్చినప్పుడు పిల్లలతోపాటు కుటుంబాలు సమాజం కూడా తీవ్రమైన ఒత్తిడికి గురవుతుంది

ఈ కేసులో ఫిర్యాదు చేసిన బాలిక తల్లి తన కూతురిపై మూడు నాలుగు సార్లు నిందితుడు లైంగిక దాడి జరిపాడని పేర్కొన్నది.అమ్మాయిని నిందితుడితో తీర్థయాత్రలకు, విందులకు వినోదాలకు ఒంటరిగా పంపించడం ఎలాంటి బాధ్యత అని రవీంద్రనాథ్ గారు అన్నారు.లైంగిక దాడి ఫిర్యాదు కంటే ముందు మూడు నాలుగు సార్లు జరిగిందని అనడంలో ఔచిత్యము ఏముంది?.బాలికపై ఫిర్యాదు కంటే ముందు మూడు నాలుగు సార్లు నిందితుడు లైంగిక దాడులకు పాల్పడ్డాడని తెలిసిన మొదటిసారి అమ్మాయిని ఎందుకు కట్టడి చేయలేదని రవీంద్రనాథ్ గారు అన్నారు.

మైనర్ బాలికగా చెబుతున్న ఈ అమ్మాయి నిందితుడి తోనే కాకుండా ఇతర అబ్బాయిలతో కలిసి పార్టీలు చేసుకుంటున్న వీడియోలు, ఇందులో మద్యం బాటిల్లు చేతిలో పట్టుకొని యువకులతో చనువుగా ఉన్న వీడియోలు కూడా వెలుగు చూస్తూ ఉన్నాయని రవీంద్రనాథ్ గారు అన్నారు.

- ఈ కేసులో నిందితుడి తరపున తాను ఆ బాలిక తల్లి పైన కూడా ఫోక్సో కేసు పెట్టాలని కోర్టులో వాదిస్తానని అన్నారు

ఈ కేసు ఎఫ్ఐఆర్ పరిశీలిస్తే కాంటెంట్ లో రేప్ చేసినట్టుగా ఎలాంటి ఆరోపణలు లేవు.

నిందితుడికి అనుకూలంగా వ్యతిరేకంగా ఉన్నటువంటి అన్ని రకాల సాక్షాలను పోలీసులు తమ ఇన్వెస్టిగేషన్ పరిశీలిస్తారు. నిజానిజాలు నిగ్గు తేలుస్తారు.ఒక ఫిర్యాదు పోలీస్ స్టేషన్ లో కేసుగా నమోదైన తరువాత ఆ కేసు కోర్టు పరిశీలనకు వచ్చిన తర్వాత ఇతరులు తమకు తోచినట్టుగా వాదనలు చేయకూడదని అంటూ నిందితుడి తరపున గాని ఫిర్యాదు దారు తరపున గాని ఇలాంటి సాక్ష్యాలు ఆక్షేపణలు ఉన్న సంబంధిత ఇన్వెస్టిగేషన్ అధికారికి అందించాలని అన్నారు.

- ఇక వేధింపుల గురించి చెబుతూ ఏ అమ్మాయి పైన అయినా మానభంగ ప్రయత్నం తీవ్రమైన నేరమని దీనికి మూడు నుంచి 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని అన్నారు.

లైంగిక వేధింపులు (Sexual Assault): కనీసం 3 నుండి 5 సంవత్సరాల జైలు శిక్ష, ఇది 7 సంవత్సరాల వరకు పెరగవచ్చు. అశ్లీల మాటలు లేదా చేష్టల ద్వారా వేధించినప్పుడు 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడవచ్చు

**ముఖ్యమైన విషయాలు:**

నో-బెయిల్ పోక్సో చట్టం కింద నమోదైన కేసులు సాధారణంగా నాన్-బెయిలబుల్ (Non-Bailable), అంటే నిందితుడికి సులభంగా బెయిల్ రాదు.

సత్వర న్యాయం కేసు నమోదైన ఒక ఏడాదిలోపు విచారణ పూర్తి చేసి తీర్పు వెల్లడించాలని చట్టం చెబుతోంది.

జరిమానా జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధిస్తారు. ఈ మొత్తాన్ని బాధితురాలి వైద్య ఖర్చులు మరియు పునరావాసం కోసం అందజేస్తారు.

- అయితే నూతనంగా బయటపడిన విషయం ప్రకారము అమ్మాయి సంఘటనలు అఘాయిత్య ప్రయత్నాలు జరిగాయని ఆరోపిస్తున్న సమయానికి ఆమె మైనర్ కాదని నిందితుల తరపున వాదనలు వినిపిస్తున్నాయి

ఇదే గనుక నిజమైతే ఆ అమ్మాయి ఆరోపణలు ఫిర్యాదు తప్పు అని పోలీసులు గనుక రుజువు చేస్తే ఆ అమ్మాయి పైన చట్టరీత్యా రివర్స్ కేసులు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి.

పోక్సో లాంటి సున్నితమైన అంశాల పైన నమోదయ్యే కేసులలో అందరూ సంయమనంతో ఉండాలి. ఎలాంటి భావోద్వేగాలు ప్రదర్శించకూడదు

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్

**జమ్మికుంట, మే 12 కరపత్రం ప్రతినిధి**

హనుమాన్ జయంతి సందర్భంగా జమ్మికుంట పట్టణ పరిధిలోని గణేష్ నగర్‌లో ఉన్న సంజీవ హనుమాన్ దేవాలయంలో భక్తిశ్రద్ధల మధ్య ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మూలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా దేవాలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. తెల్లవారుజాము నుంచే హనుమాన్ భక్తులు ఆలయానికి చేరుకుని ఆంజనేయ స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వేదమంత్రాల నడుమ ఆలయ అర్చకులు నిర్వహించిన ప్రత్యేక పూజలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాయి.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ, శ్రీరాముడిపై అచంచల



భక్తి, ధైర్యం, సేవాభావానికి ప్రతీక అయిన ఆంజనేయ స్వామి ఆశీస్సులతో జమ్మికుంట పట్టణ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం, ఐశ్వర్యం కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

హనుమాన్ జయంతి పర్వదినం ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడంతో పాటు ధర్మం, భక్తి, సేవా భావాలను గుర్తు చేస్తుందని అన్నారు. యువత ఆంజనేయ స్వామి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని



క్రమశిక్షణ, ధైర్యసాహసాలతో ముందుకు సాగాలని సూచించారు.

పట్టణంలోని ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భజనలు, ప్రత్యేక హారతులు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. హనుమాన్ నామస్మరణతో గణేష్ నగర్ ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, బూరుగుపల్లి రాము, చరణ్, రావికంటి రాజ్‌కుమార్, పిట్టల రమేష్, జక్కె రవీందర్, అఖిలేష్, హనుమాన్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్రసమాచారం దేశాభివృద్ధికి పునాది

- జనగణన ప్రతి పౌరుడి బాధ్యత
- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**

జనగణన ప్రతి పౌరుడి బాధ్యత అని, సమగ్ర ఖచ్చితమైన సమాచారం దేశాభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. జనగణనపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో మంగళవారం జిల్లా కలెక్టరేట్ నుండి ఐబీ వరకు నిర్వహించిన "జనగణన అవగాహన మారథాన్ వాక్" కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. జిల్లాలో

జనగణన ప్రక్రియలో భాగంగా మే10 వరకు స్వీయ



గణన నిర్వహించగా, మే 11 నుంచి ఇంటింటి గణన ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తు న్నారని తెలిపారు.

జనగణన సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేశామని, ప్రజలు వారికి సహకరించాలని కోరారు. జనగణనలో సేకరించే వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. జనగణన ద్వారా ప్రభుత్వానికి ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన అవగాహన ఏర్పడి, సంక్షేమ పథకాల రూపకల్పన అమలులో ఉపయోగ

పడుతుందని తెలిపారు. దేశ అభివృద్ధికి ఖచ్చితమైన గణాంకాలు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రతి కుటుంబం సరైన వివరాలు అందించి జనగణన విజయవంతానికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, రెవెన్యూ, పోలీస్ అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎన్యూమరేటర్లు, ఆశా వర్కర్లు, వివిధ కళాశాలల విద్యార్థులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, యువత, తదితరులు పాల్గొన్నారు.

## తాలెల్మ గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మకు బోనాల సమర్పణ

**కరపత్రం ప్రతినిధి అందోలు**

సంగారెడ్డి జిల్లా అందోలు మండలం తాలెల్మ గ్రామంలో మంగళవారం సంఘం ఆధ్వర్యంలో ఢోలు వాయిద్యాలు పోతరాజుల విన్యాసాలతో డీ జే,పాటలతో యువకులు ఉత్సాహంతో స్టెప్పులతో గ్రామంలోని గౌడ కులస్తులు ప్రతి గడప గడప నుండి భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తాలెల్మ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు సిహెచ్. రాజగౌడ్, ఉపాధ్యక్షులు పి. లింగా గౌడ్, సంఘం సభ్యులు, మహిళలు, గ్రామ పెద్దలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని బోనాల ఉత్సవాలను విజయవంతం చేశారు.

## లింగారెడ్డి పల్లి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ప్రధాన శాస్త్రవేత్త సైదా నాయక్

- మాసాయిపేట మండల వ్యవసాయ అధికారిని కవిత

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట మే 12**

మెదక్ జిల్లా మాసాయిపేట మండలం లింగారెడ్డి పల్లి గ్రామంలో మంగళవారం నాడు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వావిద్యాలం ఆధ్వర్యంలో జరుగుతున్న "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం లింగారెడ్డి పల్లె గ్రామము లో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డాక్టర్ సైదా నాయక్ ప్రధాన శాస్త్రవేత్త , మాట్లాడుతు, పంటలలో యూరియా వినియోగం తగ్గించడం, రసాయన ఎరువుల వినియోగం తగ్గించి జీవ ఎరువులు వాడడం సేంద్రియ పద్ధత్తులపై వివరించడం జరిగింది. వాన కాలంలో సన్న రకాల గురించి చర్చించడం జరిగింది. పంట మార్పిడి వల్ల జరిగే మేలు, నీటి ఆదా చేయడం మార్కెట్లో గిరాకీ ఉన్న వరి పంటలపై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మండలం వ్యవసాయ అధికారి కవిత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## గుడులు, బడుల వద్ద మద్యం షాపుల తొలగింపు

**- సిఎంను అభినందిస్తూ విశాల్ పోస్ట్**

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తీసుకున్న సాహసోపేత నిర్ణయంపై సినీ నటుడు విశాల్ ప్రశంసల వర్షం కురిపించారు. ప్రార్థన మందిరాలు, విద్యాసంస్థలు, ముఖ్యంగా పాఠశాలల సమీపంలో ఉన్న 717 మద్యం దుకాణాలను మూసివేస్తున్నట్లు సీఎం విజయ్ ప్రకటించడంపై విశాల్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఈ నిర్ణయం ఎంతో మంది విద్యార్థినులకు, సామాన్య ప్రజలకు పెద్ద ఊరటనిస్తుందని ఆయన కొనియాడారు. అలాగే విశాల్ తన పోస్ట్‌లో ఒక ఘటనపై ప్రస్తావిస్తూ.. 'ఆర్.కె. నగర్‌లో నేను కలిసిన ఒక విద్యార్థిని, ప్రతిరోజూ స్కూల్ నుంచి ఇంటికి వెళ్లేటప్పుడు మద్యం షాపుల దగ్గర ఎదురయ్యే వేధింపుల గురించి, ఆ ఒత్తిడి గురించి ఫిర్యాదు చేసింది. ఆ అమ్మాయి లాంటి ఎంతో మంది విద్యార్థినులు, సామాన్యులు నేడు మీ నిర్ణయం పట్ల ఎంతో సంతోషంగా ఉన్నారు. వారి ముఖాల్లో మీరు చిరునవ్వు నింపారు' అని విశాల్ పేర్కొన్నారు.

# రేపు ఖని బస్టాండ్ కార్గో కార్యాలయంలో డెలివరీ కాని కార్గో వస్తువులకు వేలం




కరపత్రం ప్రతినిది గోదావరిఖని మే 12:
గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్ కార్గో కార్యాలయం ఆవరణలో మే 14 న గురువారం సాయంత్రం 4 గంటలకు డెలివరీ కాని వస్తువులకు వేలం వేయడం జరుగుతుందని టిజిఎస్ఆర్టిసి కరీంనగర్ జోన్ ఎ. టి ఎం. వెంకటనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరిఖని, పెద్దపల్లి బస్టాండ్ లోని కార్గో ఆఫీస్ లో ఆటో మొబైల్స్ స్పేర్ పార్ట్స్ స్టేషనరీ, జనరల్ ఐటమ్స్ వినియోదారులు తీసుకోకపోవడంతో మిగిలాయని ఆయన పేర్కొన్నారు. దాంతో అట్టి వస్తువులకు వేలం వేయడం జరుగుతుందని ఆయన వివరించారు. కాగా మరిన్ని వివరాలకు 9154298557, 9949407275 సెల్ ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

# 30 రోజుల ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభం

కరపత్రం ప్రతినిది, గోదావరిఖని మే 12:



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జి.ఎం. కాలనీ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన 30 రోజుల వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని మంగళవారం ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్జీ-1 జనరల్ మేనేజర్ లలిత కుమార్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు ఇటువంటి శిక్షణ శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని, ఇందులో ఎంపికయిన వారికి కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆద్వర్యంలో సర్టిఫికెట్ కూడా ప్రదానోత్సవం జరుగుతుందని జిఎం పేర్కొన్నారు. మే 12 నుండి జూన్ 11 వరకు (30 రోజుల పాటు), 12 సంవత్సరాల నుండి 23 సంవత్సరాల లోపు విద్యార్థులు అర్హులని,
కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆద్వర్యంలో మూడవ సంవత్సరం నిర్వహిస్తున్న ఈ క్రికెట్ క్రీడా శిక్షణ ద్వారా యువతకు వృత్తిపరమైన మెళకువలను నేర్పించడం ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సీనియర్ పివో హనుమంతరావు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు కిరణ్ కుమార్ యాదవ్, కోచ్‌లు సుదేష్, రాజ్ కుమార్ శ్రీనాథ్, రవి, శేఖర్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారిని తదుపరి స్థాయి టోర్నమెంట్లకు ఎంపిక చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# జోగి పేటలో భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు

-భక్తులతో కిటకిటలాడిన హనుమాన్ దేవాలయాలు
-భక్తులకు అన్నదాన కార్యక్రమాలు

కరపత్రం ప్రతినిది అందోలు





శ్రీరామ భక్తుడు ఆంజనేయ స్వామి జన్మదిన సందర్భంగా అందోలు నియోజకవర్గం పరిధిలోని హనుమాన్ దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. హనుమాన్ దేవాలయాన్ని భక్తులతో శోభాయామానంగా మారాయి. ఆయా ఆలయాల వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.
జోగిపేటలో: శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా జోగిపేట పట్టణంలోని పబ్బతి హనుమాన్ మందిరం, శ్రీ వీర హనుమాన్ మందిరం, పంచముఖి హనుమాన్ మందిరాలలో శ్రీరామదూత ఆంజనేయ స్వామిని భక్తులు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మౌనిక పద్ధతి హనుమాన్ మందిరంలో హనుమంత్ కుమార్, సరిత దంపతులచే ఆలయ పూజారి లక్ష్మణ చారి ప్రత్యేక పూజలు చేయించారు. శ్రీ వీర హనుమాన్ మందిరం వద్ద స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పోక్సో కేసుపై బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలి

- నిందితులకు చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా సహకరించాలి
- మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ డిమాండ్

జమ్మికుంట, మే 12 కరపత్రం ప్రతినిది
కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ డిమాండ్ చేశారు. జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మైనర్ బాలికకు సంబంధించిన పోక్సో కేసు విషయంలో నిష్పక్షపాత విచారణ జరగాలంటే బండి సంజయ్ పదవిలో కొనసాగడం సమంజసం కాదన్నారు.
ఈ సందర్భంగా మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ, మహిళల రక్షణ, న్యాయం, నైతిక విలువల గురించి తరచూ మాట్లాడే బండి సంజయ్, ఇప్పుడు తన కుటుంబానికి సంబంధించిన కేసులో మాత్రం భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.



మైనర్ బాలికకు న్యాయం జరగాల్సిన సమయంలో అధికార ప్రభావంతో కేసును మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని అన్నారు.
పోక్సో వంటి అత్యంత సున్నితమైన కేసుల్లో రాజకీయ జోక్యం లేకుండా పూర్తి స్థాయి విచారణ జరగాలని, చట్టం ముందు అందరూ సమానమనే భావన ప్రజల్లో కలగాల్సిన అవసరం ఉందన్నారు. మహిళల భద్రత, బాలికల రక్షణ విషయంలో సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన నాయకులు ఇలాంటి సందర్భాల్లో నైతిక బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు.
కేంద్ర సహాయ మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి తన పదవిని ఉపయోగించి ప్రభావం చూపుతున్నారనే అనుమానాలకు తావు లేకుండా వెంటనే రాజీనామా చేసి విచారణకు సహకరించాలని ఆయన డిమాండ్ చేశారు. పోక్సో కేసులో నిందితులకు చట్టప్రకారం ఏ శిక్ష విధిస్తారో అదే శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను కోరారు.
మైనర్ బాలికలకు న్యాయం జరిగే విధంగా పోలీసులు, దర్యాప్తు సంస్థలు ఒత్తిళ్లకు లోనుకాకుండా పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మహిళా సంఘాలు, ప్రజాసంఘాలు, సామాజికవేత్తలు ఈ అంశంపై స్పందించి బాధితురాలికి అండగా నిలవాలని కోరారు.
ఈ మీడియా సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు కోలుగురి సురేష్, పొనగంటి రాము, చింతల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ పోనగంటి సంపత్, మంద రాజేష్, పోల్సాని వేణుగోపాల్ రావు, భిక్షపతి, శివశంకర్, శివ నాయకులు శ్రీనివాస్, రాము, సందీప్, నదీం తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ సర్వే పూర్తి చేయాలి

- జనాభా నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- ఎన్యూమరేటర్లకు మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి దిశానిర్దేశం

జమ్మికుంట, మే 12 కరపత్రం ప్రతినిది
దేశ అభివృద్ధికి, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలుకు పునాది వంటిదైన జనాభా గణన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి సహకరించాలని జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి పిలుపునిచ్చారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనాభా నమోదు 2026-27 కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన ఏరియాలో ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించాలని ఆయన మంగళవారం స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెలలో పట్టణ పరిధిలో ఇంటింటికీ వెళ్లి జనాభా నమోదు ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. జనాభా గణన కేవలం లెక్కల ప్రక్రియ మాత్రమే కాదని, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలకు ఇది కీలక ఆధారమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్య, వైద్యం, రహదారులు,





తాగునీటి సౌకర్యాలు, గృహ నిర్మాణ పథకాలు వంటి అనేక కార్యక్రమాల రూపకల్పనకు జనాభా గణనలో నమోదయ్యే వివరాలు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు.
ఎన్యూమరేటర్లు ప్రజల ఇళ్లకు వెళ్లినప్పుడు కుటుంబ సభ్యులు పూర్తి సహకారం అందించాలని, అడిగిన వివరాలను సరైన విధంగా తెలియజేయాలని కమిషనర్ కోరారు. ప్రతి ఇంటిలో కుటుంబ సభ్యుల సంఖ్య, విద్యా వివరాలు, ఉపాధి, వలసలు, సామాజిక పరిస్థితులు వంటి అంశాలను నమోదు చేయడం ద్వారా ప్రభుత్వానికి ఖచ్చితమైన సమాచారం అందుతుందని తెలిపారు.
సర్వే నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా ఎన్యూమరేటర్లు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. కేటాయించిన ఏరియాలో ఒక్క ఇంటిని కూడా మిస్ కాకుండా ప్రతి కుటుంబాన్ని కలవాలని, సెన్సస్ పత్రాల్లో పొందుపరిచిన ప్రతి అంశాన్ని జాగ్రత్తగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు.
జనాభా నమోదు కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, కాలనీ సంక్షేమ సంఘాలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పూర్తి స్థాయిలో సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికలకు ప్రజల సహకారం అత్యంత అవసరమని పేర్కొన్నారు.
జమ్మికుంట పట్టణంలో జనాభా గణన కార్యక్రమాన్ని పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్వే సమయంలో ప్రజలు ఇంట్లో అందుబాటులో ఉండి అవసరమైన వివరాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా పట్టణంలోని వాస్తవ జనాభా వివరాలు ప్రభుత్వానికి అందుతాయని చెప్పారు.
ఈ కార్యక్రమంలో టీపీవో శ్రీధర్, టీపీబీవో దీపిక, ఎన్యూమరేటర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్మన్ కార్యాలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం

- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

జమ్మికుంట, మే 12 కరపత్రం ప్రతినిది
జమ్మికుంట పట్టణ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత సమర్థవంతంగా సేవలు అందించేందుకు జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మూలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
జమ్మికుంట పట్టణంలోని 23వ వార్డు పాత మార్కెట్ సమీపంలో, పద్మశాలి భవనం పక్కన ఏర్పాటు చేసిన ఈ కార్యాలయ ప్రారంభ మహోత్సవం రేపు అనగా మే 13, 2026 బుధవారం ఉదయం 9 గంటల 51 నిమిషాలకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి



హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు.
ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి వార్డు మరియు పట్టణ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే లక్ష్యంతో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలు, అభ్యర్థనలు, అభివృద్ధి సూచనలు నేరుగా తెలియజేసుకునే వేదికగా ఈ కార్యాలయం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.
ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జమ్మికుంట పట్టణ ప్రజలు, వివిధ వార్డుల కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సామాజిక కార్యకర్తలు, యువజన సంఘాల ప్రతినిధులు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.
ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్‌కు ప్రజల ఆశీర్వాదాలు, సహకారం ఎల్లప్పుడూ ఉండాలని నాయకులు ఆకాంక్షించారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆకుల స్వామి వివేక్ పటేల్‌ను పరామర్శించిన పుట్ట మధూకర్

- ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన
- బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పిన మాజీ ఎమ్మెల్యే

పెద్దపల్లి, మే 12 కరపత్రం ప్రతినిది
పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆకుల స్వామి వివేక్ పటేల్‌ను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి చేరుకున్న పుట్ట మధూకర్‌ను వైద్యులు, కుటుంబ సభ్యులు కలిసి ప్రస్తుతం అందిస్తున్న వైద్యం గురించి వివరించారు. ఈ సందర్భంగా బాధితుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, వివేక్ పటేల్‌కు ధైర్యం చెబుతూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆందోళన చెందవద్దని, అవసరమైన సహాయం అందించేందుకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.
ఆసుపత్రి వైద్యులతో ప్రత్యేకంగా మాట్లాడిన ఆయన,



బాధితుడికి అత్యుత్తమ వైద్యం అందించాలని కోరారు. అవసరమైతే ఉన్నత వైద్య సదుపాయాలు కల్పించాలని, ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా నిరంతరం వైద్య పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని గుర్తు చేశారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ ఆసుపత్రులపైనే ఆధారపడుతున్నారని, అందుకే ప్రతి రోగికి మానవత్వంతో సేవలు అందించాలని అన్నారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని వైద్యులను కోరారు.
ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ, సమాజంలో ఎవరికైనా కష్టసమయంలో అండగా నిలబడటం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని అన్నారు. ప్రజల సమస్యలు, ఆరోగ్య ఇబ్బందులు, కుటుంబ పరిస్థితులను దగ్గరుండి తెలుసుకోవడం ద్వారా వారికి ధైర్యం కలుగుతుందని పేర్కొన్నారు.
ఆకుల స్వామి వివేక్ పటేల్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు మనోధైర్యం కోల్పోకుండా వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు.
ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇతర రోగులను కూడా మాజీ ఎమ్మెల్యే పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం మరింత దృష్టి సారించాలని అన్నారు.
పుట్ట మధూకర్ ఆసుపత్రికి రావడంతో పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. బాధిత కుటుంబానికి సంఘీభావం తెలియజేస్తూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.